# వీరుని వధ - రాముని కథ

''ఎన్నెస్సార్''

సాయంకాలం ఆరుగంటలు కావొచ్చింది. రాముడు రోడ్డుప్రక్కన చెట్టుక్రింద రిక్షా ఆపుకొని, ఉదయం ఆరుగంటలనుంచి, సాయంకాలం ఆరుగంటల వరకు, తాను తోలిన రిక్షాబాడుగ లెక్కజూచుకున్నాడు అంతా లెక్కజూచుకుంటే, నంచిలోని చిల్లరడబ్బుల మొత్తం రూపాయిన్నరకు మించలేదు. రాముడు ఒకటికి పదిసార్లులెక్కించుకున్నాడు. ఎన్నిసార్లు లెక్కించినా మొత్తం రూపాయిన్నరే! మనిషి ఒక్కసారి స్తంభించిపోయాడు. అంతులేని నీరసం ఒళ్ళంతా ఆవరించింది. పగలంతాకష్టబడ్డా, రిక్షా అద్దెపోను, తాను మిగల్చుకలిగింది పైసాగూడా లేదు. వచ్చిన చిల్లర మొత్తం రిక్షా యజమానికి, అద్దెకింద జమపడుతుంది. ఇక తనకు మిగిలింది శరీరకష్టంతప్ప, శ్రమ ఫలితం సున్నా. సొంత రిక్షా అయితే, ఎంత సంపాదించుకున్నా దిగులుండదు. పైగా యిదివరకే యివ్వవలసిన పాతబాకీ రూపాయి, యింతవరకు జమ పడలేదు. చివరికి తనలో తానే విసుక్కున్నాడు. ఇదివరకు రిక్షా యెక్కితే, అద్దెపోను కొద్దోగొప్పో మిగులుతుండేది. ఊళ్ళో రిక్షాల సంఖ్య పెరిగేసరికి, బాడుగలుకూడ సన్నగిల్లినయ్. దీనికంటే యే కూలో, నాలో జేసుకోవటం మేలనిపించింది.

అనుకోకుండా రాముడికి, యింటిసంగతి గుర్తుకొచ్చేసరికి గుండె ఒక్కసారి జల్లుమంది. ఒళ్ళంతా ముచ్చెమటలు బోసినయ్. వారంరోజులనుంచి అమ్మ జ్వరంతో బొత్తిగా లేవటంలేదు. అమ్మకు బాగున్నంతకాలం తాను తెచ్చినా, తేలేకపోయినా అక్కడక్కడ కూలినాలీజేసి యిల్లు గడుపుతుండేది మరీ వారంరోజులనుంచి, యింట్లో అన్నీ కరువైనయ్. పోనీ, అమ్మకు మంచి మందిప్పిద్దా మనుకున్నా, పట్టుమని పదిడబ్బులు చేతిలో కానరావటంలేదు. అయ్య చనిపోయినదగ్గరనుంచి. తనని, తనతరవాత యిద్దరిపిల్లల్ని, అమ్మే సాకుతూ వచ్చింది. ఈనాడు అమ్మ మంచంయెక్కేసరికి. ఆ బాధ్యత తనమీద పడింది. తను జూడబోతే యింకా యిరవయ్యోపడిలో బడనేలేదు. తనూ, అమ్మ అయితే. తిన్నా తినకపోయినా సర్దుకుపోగలరు. కాని, యింకా ప్రపంచమంటే తెలియని పసికందులు, మిగిలిన యిద్దరు యెలా? మరీ ఒక వారంనుంచి ఒక పూటతిని, ఒక పూట లేక పస్తులుండటం అందరికి అలవాటయింది. ఇలా ఆలోచనలమధ్య అరగంట గడిచిపోయింది. ఇక క్షణంగూడ ఆగకుండా బండిదీసుకొని బయలుదేరాడు.

మొత్తం బాడుగడబ్బులు, రిక్షా అద్దెక్రింద జమకట్టి, రాముడు వట్టిచేతుల్తో యింటికిబయల్దేరాడు. పొద్దున యింటిదగ్గర అడుగు, బొడుగు చద్దిమెతుకులు తప్ప యింతవరకు కడుపులో యేదివెయ్యలేదు. ఆకల్ని చంపుకోటానికి, పోసిన టీనీళ్ళు యెప్పుడో హరాయించుకుపోయినయ్. కడుపులో మరో ఆదరవంటూ లేకపోవటంతో, ఒళ్లంతా నీరసంగా వుంది. కళ్ళు మండుతున్నయ్. కాస్త మగత గూడ ఆవరించింది. పగలల్లా రిక్షా తొక్కడంవల్ల, కాళ్ళలో సత్తువంతాబోయి తప్పటడుగులు బడసాగినయ్.

సాయంకాలం ఆరు గంట లవటంవల్ల, బజార్లన్నీ జనంతో క్రిక్కిరిసిఉన్నయ్. పగలల్లా ఆఫీసుల్లో, కర్మాగారాలలో ఒళ్ళు విరగ్గొట్టుకొని, యింటికిజేరుకొనే గుమాస్తాలు, కార్మికులు, కూలీలు; కాలేజీ వదలగానే ఉల్లాసంగా ఆడుకుంటూ, పాడుకుంటూ తిరుగాడే విద్యార్థి బృందాలు; పనిలేక, పొద్దుబోక రోడ్డుపక్కనజేరి బాతాఖానీగొట్టే పెద్ద మనుష్యులు, నిరుద్యోగులు; సినిమాల టైం మించిపోతుందేమోనన్న భయంతో, ఆరాటంతో అరుదెంచే యువతీయువకులు; వీరికితోడు కార్లమోతలు, బండ్ల గోలలు, రిక్షాల అరుపులు; సైకిల్ గంటలు... బజార్లన్నీ గజిబిజిగా ఉన్నయ్. రాముడు రోడ్డుమీద

నడుస్తున్నాడన్నమాటేగానీ, జీవాలని, నిర్జీవాలని యెలా తప్పుకుంటున్నాడో తెలియదు. గతాన్ని తలుచుకుంటూ, భవిష్యత్తు నూహించుకోలేకబోతున్నాడు.

శుష్కించిన శరీరంతో రాముడు తనగుడిసె జేరుకున్నాడు. గుడిసె ఊరికి దూరంగా, అరుబయట ఉంది. ఆ చుట్టుపక్కల రాముడితోటివాండ్ల గుడిసెలు దూర దూరంగా వ్యాపించి ఉన్నయ్. అప్పుడే, ఆప్రాంతమంతా మనకచీకటి వ్యాపించింది. ఆప్రాంతంలో మానవుల అలికిడి అనలే తక్కువ. అప్పుడప్పుడు కుక్కలు మాత్రం, కూనిరాగాలు దీస్తున్నాయ్. దూరంగా రోడ్డు మలుపునవున్న మునిసిపాలిటీవారి దీపస్తంభం మిణుకు, మిణుకుమంటూ ఒంటరితనాన్ని గుర్తుజేస్తోంది. రాముడు తటపటాయిస్తు, గుడిసెముందు నుంచున్నాడు. లోపల గుడిసంతా గాఢాంధకారంగా ఉంది. లోపలనుంచి అమ్మ మూలుగుమాత్రం అప్పుడప్పుడూ వినబడుతోంది. ఇద్దరుపిల్లలు బహుశా ఆకలితో నిద్రకారిగుండొచ్చు. అసలు ఉదయంనుంచి యేమన్నా గతికారో లేదో! రాముడికి ఒక్కసారి దుఃఖం వచ్చినంత పనైంది. ఇక క్షణంగూడ అక్కడనిలబడలేకపోయాడు.

తిరిగి రాముడు రోడ్డెక్కేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. అందుకు గురుగా మునిసిపాలిటీవారి సైరన్ హీనస్వరంతో అరుస్తోంది. రాముడు, యెంత దూరం నడిచాడో, యెక్కడికి వెళుతున్నాడో తెలియదు అనుకోకుండా రాముడిదృష్టి రోడ్డుప్రక్కగా ఉన్న ఒక ఆవరణమీద పడింది. ఆవరణలో చాలమంది గుమిగూడిఉండటం కనుపించింది. అక్కడేం జరుగుతున్నదో నన్న కుతూహలంతో ఆవరణ దగ్గరగా వెళ్ళాడు. ఆవరణమంతా జనంతో క్రిక్కిరిసిపోయింది. పిల్లలుమొదలు వృద్ధులవరకు ఆవరణలో కూర్చుండిపోయారు. అక్కడక్కడ అమర్చిన విద్యుద్దీపాల కాంతి ఆవరణ అంతా పడుతోంది. రాముడు మొదట అదో పెండ్లేమో ననుకున్నాడు. కాని కొంచెం పరికించిజూస్తే అదికాదని తేలింది. ఎవరో ఒక బట్టతల వృద్ధుడు దూరంగా యెత్తయిన బల్లమీదకూర్చొని, ముందున్న పుస్తకంపైపొకసారి, జనంపైపొకసారి జూస్తూ పెద్దగా చెప్పుకోబోతున్నాడు. మధ్యమధ్య అక్కడజేరినజనం, భగవన్నామం జేస్తూ అతనితోపాటు కేకలు బెడుతున్నారు. రాముడుకి కొద్దో, గొప్పో చదువు వచ్చిఉంటే, అదో పురాణ కాలక్షేపమని యిట్టే అర్థమైయుండేది. కాని చదువుసంధ్యలు లేని రాముడి కిదంతా అగమ్యగోచరంగా వుంది.

ఆవరణమంతా ఒక్కసారి నిశ్శబ్దం ఆవరించింది. పురాణం శాస్త్రిలుగారు, భారతాన్ని వల్లెవేస్తున్నాడు. ఒక్కొక్క సంస్కృత శ్లోకం చదువుతూ, దాని అర్థాన్ని పామరుల మొదలు పండితులవరకు అర్థమయ్యేలాగ చెప్పుకుపోతున్నాడు రాముడు ఆకల్ని మరచిపోయి, కథ శ్రద్ధగా వినసాగాడు.

కథ భారతంలో యుద్ధకాండ జరుగుతుండటం వలన, వినటానికింపుగా, ఉత్సాహంగా ఉంది. పద్మవ్యూహంలో అభిమన్యు డొంటరిగా ప్రవేశించటం మొదలు చివరికి పదిమంది పెద్దలేకమై, పసివాణ్ణి ఎలా చిత్రవధజేసింది... అంతా వివరంగా, విపులంగా శాస్త్రిలుగారు వర్ణించసాగారు. రాముడు కథ చాల యిష్టంగా వినసాగాడు. కథ వింటున్న జనం, అభిమన్యుడికి జరిగిన అన్యాయంగురించి, అనేక విధాలుగా వాపోసాగారు. అభిమన్యుణ్ణి ఒంటరిగాజేసి అన్యాయంగా జంపిన, దుర్యోధన బలగాన్ని తిట్టుకుంటూ, అభిమన్యుడి ప్రతాపాన్ని మెచ్చుకుంటూ... అక్కడజేరిన అందరి మనసులు విలపించినయ్ అభిమన్యుడి మరణానంతరం, శాంతికోసం అక్కడ లెక్కలేని కొబ్బరికాయలు మోగినయ్. ఎన్నో భగవన్నామస్మరణలు జరిగినయ్.

రాముడి మనసు కథమీదనుంచి, కొబ్బరి చిప్పలమీదకు మళ్ళింది. కనీసం వచ్చి కొబ్బరితో కడుపు నింపుకుందామనుకున్నా అందుకు పైనలు కరువైనయ్. కాసేపు ఓపికబడితే, ఫలహారం అన్నా ముట్టకపోతుందా అని అలాగే నిలబడిపోయాడు. శాస్త్రిగారు ముందు, ముందు యేం జెపుతారోనన్న ఆశతో జనం యెదురుచూడసాగారు. కథ నిదానంగా యిక సుభద్రార్జునుల పుత్రవియోగంలోకి దిగింది.

కథ మధ్యలో ఒకరు పళ్ళెంలో హారతి కర్పూరం వెలిగించి, జనంమధ్యలో జొరబడ్డాడు.

ఆయన చేయిజాచి పళ్ళెంబడుతుంటే, యెవరికి తోచినవిధంగా వారు, చిల్లరడబ్బులు పళ్ళెంలో వేస్తున్నారు. హారతి ఆరిపోకుండా, ఒక్కొక్క కర్పూరపు ముక్కని ముందుకునెడుతూ, పళ్ళెంపట్టుకున్న తను గబగబా ఆవరణం చుట్టవేయసాగాడు. కానుకల పళ్ళెం క్రమేపి రాముడు నుంచున్న ఆవరణపు గేటు వరకు వచ్చింది. పళ్ళెమంతా చిల్లరడబ్బులతో నిండిపోయింది.

అంత చిల్లర, ఒక్కసారిజూచేసరికి రాముడికి మతిపోయినంత పనైంది. పగలల్లా కష్టించినా, తానేనాడు అంతడబ్బు చూడలేదు. శాస్త్రిగారు కాలుక్రింద మోపకుండా, కానుకలంటూ అంత చిల్లర సొంతం జేసుకోవటం... రాముడికి ఆశ్చర్యంతోబాటు ఈర్ష్య కూడ కలిగింది.

పురాణం జోరుగాసాగుతోంది. జనందృష్టంతా కథమీదనేలగ్నమైంది. కాని రాముడి మనసుమాత్రం కథమీదనుంచి ఒక్కసారి కానుకల పళ్ళెంమీదకి మరలింది. అంతులేని పిచ్చిపిచ్చి ఆలోచనలు ఒక్కసారి మనసులో ఉరకలువేసినయ్. ఏమాలోచించాడో యేమోనతడు, చుట్టూ ఒకసారి పరికించిచూసాడు. పాపం యేమీతెలియని అవతలిమనిషి పళ్ళాన్ని రాముడిముందుకు జాచాడు. అంతే... రాముడు పళ్ళెంలోని హారతిని ఊదిపి, చేతికందినన్ని చిల్లర డబ్బులు చేతలందుకొని, పరుగులంకించుకున్నాడు. పళ్ళాన్ని పట్టుకున్నవ్యక్తి గాభరాతో పళ్ళాన్ని ఒకసారి జారవిడిచి, "దొంగ... దొంగ..." అంటూ కేకవేయసాగాడు. ఆవరణంలోని జనం ఒక్కసారి గొల్లుమంటూ లేచారు. పురాణంజెప్పే శాస్త్రిగారు యేమీ బోధపడక అలాగే కూర్చుండిపోయాడు. ఆవరణలో ఉన్న కొంతమంది రాముడ్ని తరుముతూ వెంటబడ్డారు. రాముడు సత్తువకొద్ది పరుగెత్తసాగాడు. పగలల్లా రిక్షాతొక్కటం, కడుపులో యే ఆధరువు లేకపోయేసరికి, పరుగిడటం చాలకష్టమేననువించింది. అయినా, సత్తువనంతా కూడగట్టుకొని, జనాని కందకుండా రోడ్డు మలుపుతిరగబోయి, వేగంగా వచ్చే కారుకు గుద్దుకున్నాడు. అంతే! కారుతాకిడికి రాముడు దూరంగా పోయి పడ్డాడు. చేతిలోని చిల్లరడబ్బులు నెత్తురుమడుగులో చెల్లాచెదురుగా, వెలవెల బోతూ పడిపోయినయ్.

మునిసిపాలిటీవారి దీపస్తంభపు వెలుతురులో, కారుకు దూరంగా, నెత్తురుమడుగులో రాముడి దేహం పడివుంది. చుట్టూ చేరిన జనం తలాఒకవిధంగా, తలబోయసాగారు. "దొంగ వెధవకు దేముడు తగిన ప్రాయశ్చిత్తమే జేసాడని;... ఏం మాయరోగం! కూలో నాలో చేసుకోకూడదా అని... ఇంత ముష్టెత్తుకుంటే పోదూ అంటూ... పావం తలపగిలిందని కొందరంటూంటే... అటువంటివాళ్ళ గతంతేనంటూ కొందరు"... ఎవరికి దోచినరీతిలో వాళ్ళు తలాఒక మాట రాముడుపై, విసరి కసిదీర్చుకోసాగారు.

అభిమన్యుడి అన్యాయపు చావుకి, సుభద్రార్జునుల పుత్రశోకానికి విలపించిన జనం, రాముడి దరిద్రపు చావుకి కారణం గుర్తించలేకపోయారు. కష్టబడ్డా ఫలందక్కక, తల్లీ తోబుట్టువులను వదులుకోలేక, ఆకల్ని అణచుకోలేక అభిమానాన్ని చంపుకొని, యేనాడు చేయనిపనిలో తలదూర్చి, తలవగిలి చస్తే, అందరు ఆడిపోసుకునే వారేగాని, ఆదరణ చూపేవారెవరు? ఆనాటి అభిమన్యుడి మరణం తరువాత! అందరి కళ్ళముందు దరిద్రపు రాముడి చావుగూడ తెల్లారిపోయింది.